క్లుప్తంగా

తోటల్లో మామిడి కాయలు చోరీ

బంగారుపాళెం: మండలంలోని రైతుల తోటల్లో మామిడికాయలు చోరీకి గురవుతున్నాయి. దాంతో బాధిత రైతులు గురువారం స్థానిక పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మండలంలోని 170 గొల్లపల్లెకు చెందిన లోకేష్‌ మామిడితోటలో బుధవారం గుర్తు తెలియని వ్యక్తులు సుమారు నాలుగు టన్నుల మామిడి కాయలను కోసి ట్రాక్టర్‌లో తీసుకు వెళ్లినట్లు తెలిపాడు. రెండు రోజుల క్రితం గుంతూరు గ్రామానికి చెందిన రైతు హరికి చెందిన మామిడి తోటలో 5 టన్నుల కాయలను కోసుకుపోయినట్లు తెలిపారు. మామిడి కాయల చోరీపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నవోదయకు ఎంపికైన తాత్వికరెడ్డి

తవణంపల్లె: మండలంలోని వెంగంపల్లెకు చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యురాలు నిర్మల, లాల్‌బహదూర్‌రెడ్డి దంపతుల కుమార్తె తాత్వికరెడ్డి అరగొండ ఈషా విద్యానికేతన్‌లో ఐదవ తరగతి చదివింది. 2023–24 విద్యా సంవత్సరానికి జాతీయ స్థాయిలో నిర్వహించిన జవహర్‌ నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించింది. జవహర్‌ నవోదయ విద్యాలయానికి ఎంపికైన విద్యార్థిని తాత్వికరెడ్డిని పాఠశాల యాజమాన్యం, గ్రామస్తులు, శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయుడు విజయ్‌ భాస్కర్‌రెడ్డి అభినందించారు.

ప్రతి ఇంటి వద్దకు వైద్యసేవలు



వైద్యసేవలు అందజేస్తున్న డాక్టర్‌ రష్మిత

గుడిపాల: ప్రతి ఇంటి ముంగిటకు వైద్యసేవలు అందజేయనున్నట్లు బొమ్మసముద్రం ప్రాథమిక వైద్యాధికారి రష్మిత అన్నారు. వెంగమాంబపురంలో గురువారం 104 వైద్య శిబిరం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లోనే ప్రతి ఇంటి ముంగిట వైద్య సేవలను అందజేస్తున్నామన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం వైద్యరంగంలో అనేక మార్పులు తీసుకువచ్చిందన్నారు. అనంతరం 60 మంది రోగులకు బీపీ, షుగర్‌, గర్భవతులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. మంచం పట్టిన రోగులకు ఇంటి వద్దకే వెళ్లి వైద్యసేవలు చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది కవిత, స్వర్ణలత, కార్లిని, రీటా తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సేవలో పూతలపట్టు ఎమ్మెల్యే



దుర్గమ్మ చిత్రపటం అందుకుంటున్న ఎమ్మెల్యే ఎంఎస్‌ బాబు

కాణిపాకం(యాదమరి): విజయవాడ కనకదుర్గమ్మను పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్‌ బాబు, కాణిపాక ఆలయ చైర్మన్‌ మోహన్‌ రెడ్డి, ఈఓ వెంకటేశు గురురవారం దర్శించుకున్నారు. ఉదయం వారు అమ్మవారి దర్శనార్థం వెళ్లగా దుర్గమ్మ ఆలయ ఈఓ స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులచే ఆశీర్వచనం అందించి అమ్మవారి చిత్రపటం తీర్థ ప్రసాదాలు అందించారు.

తమిళనటుడు విజయ్‌ జన్మదిన వేడుకలు



పుస్తకాలు పంపిణీ చేస్తున్న అభిమానులు

చిత్తూరు రూరల్‌: తమిళనటుడు విజయ్‌ జన్మదిన వేడుకలను గురువారం ఒంద్రే తలైమై మక్కల్‌ ఇయకమ్‌ సంఘ సభ్యులు ఘనంగా జరుపుకున్నారు. దివ్యాంగుల చేతుల మీదుగా కేక్‌ కట్‌ చేయించి వారికి అన్నదానం చేయించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సురేష్‌బాబు, సభ్యులు దినేష్‌, వినోద్‌కుమార్‌, జీవా, రాజు, పూర్ణ తదితరులు పాల్గొన్నారు. చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చిత్తూరు అభిమాన సంఘ సభ్యులు రక్తదానం చేశారు. సంఘ అధ్యక్షుడు పురుషోత్తం, సభ్యులు శరత్‌, బాబు, మనోజ్‌, అర్జున్‌, దిలీప్‌, మౌళి, ధనుష్‌, జ్ఞాన, నవీన్‌, వెంకటేష్‌, అజీఫ్‌, మని, షరీఫ్‌ తదితరులు పాల్గొన్నారు. చిత్తూరు నగరంలోని తోటపాళ్యంలో గురువారం తమిళనటుడు విజయ్‌ జన్మదిన వేడుకలను అభిమానులు జరుపుకున్నారు. ఈసందర్భంగా పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. పిల్లలకు నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెంకటేష్‌, శరవణ, సురేష్‌ లక్ష్మణ్‌, కంద, తదితరులు పాల్గొన్నారు.

ఫీజుల వాత బ్యాగుల మోత

- ప్రైవేటు పాఠశాలల నిర్వాకం
- బస్తాల్లా మారిన విద్యార్థుల బ్యాగులు
- కాన్వెంట్‌ మాయలో తల్లిదండ్రులు



మోయలేని భారంతో బడికి వెళ్తున్న చిన్నారులు

ప్రభుత్వ బడులు సకల సదుపాయాలతో కళకళలాడుతుంటే ఇంకా కొన్నిచోట్ల తల్లిదండ్రులు కాన్వెంట్‌ మాయలోనే ఉన్నారు. పిల్లలను ప్రైవేటు బడులకే పంపుతున్నారు. అక్కడ ఫీజుల మోతతో తల్లిదండ్రులు, పుస్తకాల బరువుతో పిల్లలు సతమతమవుతున్నారు. పుస్తకాల బస్తాను ఏళ్లపాటు వీపుపై మోస్తున్న పిల్లలను అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి. సర్కారు బడుల కన్నా ఎక్కువ చదువు చెబుతున్నామంటూ ప్రైవేటు యాజమాన్యాలు సొంత సిలబస్‌తో కుప్పలు కుప్పలుగా పుస్తకాలు తయారుచేసి విద్యార్థులకు అంటగట్టేస్తున్నాయి. దీంతో విద్యార్థులను భవిష్యత్‌లో వెన్నెముక సమస్యలు వెంటాడుతాయి.

గుడిపాల: జీవితం ప్రారంభ దశలోనే బాలలు బండెడు భారాన్ని మోస్తున్నారు. ఆటపాటలతో హాయిగా చదువుకోవాల్సిన వయసులో బ్యాగు నిండా పుస్తకాల మోతతో అల్లాడిపోతున్నారు. నిబంధనల ప్రకారం ప్రతి విద్యార్థి శరీర బరువులో పదోవంతు మాత్రమే పాఠశాల బ్యాగు బరువు ఉండాలి. కానీ ప్రయివేట్‌, కార్పొరేట్‌ పాఠశాలల పుస్తకాల సంఖ్యను పెంచడంతో మోయలేని భారం విద్యార్థుల పాలిట శాపంగా మారుతోంది. భవిష్యత్‌లో వారికి ఆరోగ్య సమస్యలు వస్తాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. నియోజకవర్గంలో 114 ప్రైవేట్‌, కార్పొరేట్‌ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో దాదాపు 23 వేల మంది విద్యనభ్యసిస్తున్నారు. చాలా పాఠశాలలు బహుళ అంతస్తుల భవనాల్లోనే నడుస్తున్నాయి. దీంతో తరగతి గదుల్లోకి బ్యాగులతో వెళ్లేందుకు విద్యార్థులు నరకయాతన అనుభవిస్తున్నారు. తెలుగు, ఆంగ్లం, హిందీ, సైన్స్‌, గణితం, సోషియల్‌ ఇలా ఒక్కొక్క సబ్జెక్టుకు పాఠ్య పుస్తకాలతోపాటు వాటికి అనుసంధానంగా వర్క్‌బుక్‌, నోట్‌బుక్‌, అసైన్‌మెంట్‌, ఆర్ట్‌క్రాఫ్‌, జీకే, కంప్యూటర్‌, డిక్షనరీలు ఇచ్చారు. యూకేజీ విద్యార్థుల బరువు 14కేజీలు ఉంటే పుస్తకాల బ్యాగు బరువు మూడున్నర కేజీల పైనే ఉంటుంది. 3వ తరగతి విద్యార్థి బరువు 22 కేజీలు ఉంటే పుస్తకాల సంచి 6 కేజీలు ఉంటుంది.

అమలుకు నోచుకోని చట్టం

పుస్తకాల భారాన్ని తగ్గించాలని ప్రభుత్వం 2006లోనే చట్టం చేసినా అమలుకు నోచుకోవడం లేదు. నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులు స్కూల్‌ బ్యాగులు మోయకూడదు. మిగిలిన తరగతులకు సంబంధించి విద్యార్థి శరీర బరువు కంటే బ్యాగు బరువు 10శాతానికి మించి ఉండకూడదు. రోజూ తెచ్చుకోవాల్సిన పుస్తకాలపై శాస్త్రీయ అంచనాలతో విద్యార్థుల తల్లిదండ్రులకు మార్గదర్శకాలు ఇవ్వాలి. ప్రయివేట్‌ పాఠశాలల యాజమాన్యాలు ప్రతి విద్యార్థికీ లాకర్లను పాఠశాలల్లో ఏర్పాటుచేయాలి. ఇలాంటి సౌకర్యాలు ఏర్పాటు చేయలేకపోయినా, నిబంధనలు పాటించకపోయినా పాఠశాలలపై చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చు.

ఫీజుల దోపిడీ

చిత్తూరులోని ఓ ప్రైవేట్‌ స్కూల్‌కి ఒకటో తరగతి చదివేందుకు వెళితే అడ్మిషన్‌ ఫీజు రూ.5వేలు, స్కూల్‌ ఫీజు రూ.35వేలు, బుక్స్‌కు రూ.3300 వేశారు. దీంతో పాటు బస్సు ఫీజు అదనంగా ఉంటుందని చెప్పారు. యూనిఫాంకు రూ.3 వేలు నిర్ణయించినట్లు చెప్పారు. ఇందుకుగాను 18 పుస్తకాలను కట్టబెట్టారు. ప్రభుత్వ పాఠశాలలో అయితే పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు 10 మాత్రమే ఉంటాయి.

లాకర్లు ఏర్పాటు చేయాలి



నిబంధనలకు విరుద్ధంగా ప్రయివేట్‌ స్కూళ్లు తమ లాభాల కోసం అవసరం ఉన్నా, లేకున్నా పుస్తకాల భారం విద్యార్థులపై మోపుతున్నారు. తల్లిదండ్రుల జేబులకు చిల్లు పడడంతో పాటు విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారు. ప్రయివేట్‌, కార్పొరేట్‌ పాఠశాలలు ప్రతి విద్యార్థికీ లాకర్లను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలి. –శశికుమార్‌, రాష్ట్రకార్యవర్గ సభ్యులు, ఏఐఎస్‌ఎఫ్‌

మెడ, వెన్ను సమస్యలు



పిల్లలు అధిక బరువుతో ఉన్న బ్యాగులను మోయడం వల్ల వెన్ను, మెడ నొప్పి సమస్యలు వస్తాయి. భవిష్యత్‌లో ఒంగిపోయే అవకాశం ఉంది. ఆశించిన మేర శరీర ఎదుగుదల ఉండదు. వెన్నుపూసపై బరువుపడి త్వరగా అలసిపోతారు. ఈ అలసటతో పాఠాలు సరిగ్గా వినలేరు. ఈ ప్రభావం రానురాను కండరాలపై కూడా పడవచ్చు. –రష్మిత, ప్రభుత్వ వైద్యాధికారి, బొమ్మసముద్రం

చర్యలు తీసుకుంటున్నాం



ప్రయివేట్‌, కార్పొరేట్‌ పాఠశాలల్లోనే లాకర్లు పెట్టుకోవాలని, పుస్తకాలను ఇంటికి పంపించకుండా కావాల్సినవి మాత్రమే తెచ్చుకునేలా చూడాలని చెబుతున్నాం. కొన్ని పాఠశాలల్లో డిజిటల్‌ క్లాసులు తీసుకోవడంతో మరిన్ని పుస్తకాలు తోడవుతున్నాయి. పాఠశాలల యాజమాన్యాన్ని ప్రశ్నించే తత్వం తల్లిదండ్రుల్లో రావాలి. –రామ్‌నాయక్‌, మండల విద్యాశాఖాధికారి, గుడిపాల

దోమల నివారణపై వైద్యుల ర్యాలీ



ఆరిమాకుల పల్లెలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రభుత్వాస్పత్రి వైద్యులు

యాదమరి: మండల పరిధిలో దోమలు అరికట్టేందుకు వైద్యుల ర్యాలీ నిర్వహించారు. మండలంలోని ఆరిమాకుల పల్లెలో గురువారం యాదమరి ప్రభుత్వాస్పత్రి వైద్యులు దోమలు అరికట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం సమావేశంలో వారు మాట్లాడుతూ కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో అపరిశుభ్రంగా ఉంటే దోమలు వ్యాపిస్తాయని తద్వారా, మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి జ్వరాలు వచ్చే అవకాశం ఉందన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. గ్రామీణ ప్రజలకు జ్వరాలు సోకితే వెంటనే ప్రభుత్వాస్పత్రిలో చికిత్స చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సురేఖ, సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణ, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

నేడు అయ్యప్పకు ప్రత్యేక పూజలు

చిత్తూరు అర్బన్‌: నగరంలోని ప్రశాంత్‌నగర్‌లో ఉన్న శ్రీ శాస్తాగిరి అయ్యప్ప స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి శబరిమల అయ్యప్ప స్వామి ఆలయ పూర్వపు అర్చకులచే ఆధార శిలా ప్రతిష్ట, కలశపూజ నిర్వహిస్తామని.. భక్తులు పాల్గొనాలని కోరారు.

చిన్నారుల ఆరోగ్యంపై జాగ్రత్తలు అవసరం



పత్రపల్లెలో బాలింత నాగజ్యోతికి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్‌ మోహన్‌వేలు

తవణంపల్లె: పురిటిలో ఉన్న పిల్లల పట్ల తల్లులు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి మోహన్‌వేలు సూచించారు. మండలంలోని పత్రపల్లెలో గురువారం ఫ్యామిలీ డాక్టర్‌ కార్యక్రమం నిర్వహించారు. 104 వైద్య శిబిరంలో గర్భిణులు, బీపీ, షుగర్‌ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు ఇచ్చారు. శిబిరంలో 75 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలు, వ్యక్తిగత శుభ్రత గురించి తెలిపారు. పిల్లలకు రక్తహీనత రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం కవల పిల్లల తల్లి టీ.నాగజ్యోతి ఇంటికి వెళ్లి ఆమె ఆరోగ్యం గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ లావణ్య, ఆరోగ్య కార్యకర్తలు సుబ్రమణ్యంరెడ్డి, వరలక్ష్మి, డీఈఓ విజయలక్ష్మి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నేడు జగనన్న సురక్ష ప్రారంభం

తవణంపల్లె: ప్రభుత్వం ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష పథకాన్ని శుక్రవారం ఉదయం 11 గంటలకు లాంఛనంగా ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ అబ్దుల్‌ కలాం ఆజాద్‌ తెలిపారు. కార్యక్రమానికి ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులు, వైస్‌ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సీఎం జగన్‌మోహన్‌ రెడ్డి జగనన్న సురక్ష పథకం ప్రారంభించే కార్యక్రమాన్ని సచివాలయాల్లో వీక్షించాలని తెలిపారు.

పుణ్యసముద్రంలో గడపగడపకు మన ప్రభుత్వం

మండలంలోని పుణ్యసముద్రం పంచాయతీలోని గ్రామాల్లో 23వ తేదీ శుక్రవారం ఉదయం 6.30 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తామని ఎంపీపీ గీతారెడ్డి, ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్‌ తెలిపారు. 24వ తేదీ మారేడుపల్లి పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమాల్లో పూతలపట్టు ఎమ్మెల్యే ఎం.ఎస్‌.బాబు ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకొని అక్కడికక్కడే పరిష్కరిస్తారని వివరించారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది తప్పక పాల్గొనాలని పిలుపునిచ్చారు.

చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న జడ్జి కరుణకుమార్‌

గంగాధరనెల్లూరు(కార్వేటినగరం) : చట్టాలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి కరుణకుమార్‌ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్‌ కార్యాలయ ఆవరణలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న న్యాయమూర్తి మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన కల్పించిన హక్కులు, విధులతో పాటు చట్టాల పట్ల అవగాహన ఉంటే నిజజీవితంలో ఎదురయ్యే అనేక పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కోవచ్చన్నారు. సమాజంలో బాల్య వివాహాలు, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. న్యాయం కోసం కోర్టుకు వెళ్లే వారికి న్యాయవాదులు సైతం ఏర్పాటు చేసుకోలేని పరిస్థితుల్లో ఉన్న వారికి ప్రభుత్వమే ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తుందన్నారు. నేటి ఆధునిక ప్రపంచంలో ఎన్నో సమస్యలు ఎదురవుతున్నాయని వీటని ఎదుర్కోవడానికి ఈ చట్టాలపై అవగాహన ఉంటే సత్వరమే వాటికి పరిష్కారం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అనిత, వైస్‌ ఎంపీపీ హరిబాబు, సర్పంచ్‌ సుబ్రమణ్యం యాదవ్‌, ఎంపీడీఓ శ్రీదేవి, డిప్యూటీ తహసీల్దార్‌ తులసీరామ్‌, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మహిళా సంఘ నేతలు పాల్గొన్నారు.

భూ సమస్య పరిష్కరించండి సారూ!

చిత్తూరు కలెక్టరేట్‌: భూ సమస్య పరిష్కరించండి సారూ.. అంటూ చిత్తూరు మండలం మాపాక్షికి చెందిన ఇమాన్యుయల్‌ కోరారు. ఆయన గురువారం డీఆర్వో రాజశేఖర్‌కు కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ చిత్తూరు మండలం మాపాక్షి హరిజనవాడ 2 గ్రామ లెక్క దాఖలాలో సర్వే నెంబర్‌ 296/6లో తనకు 0.58 సెంట్లు స్థలం ఉందన్నారు. తనకు చెందిన భూమిని అదే గ్రామానికి చెందిన మరొకరు ఆక్రమించుకున్నట్లు వాపోయారు. ఉన్నతాధికారులు విచారించి తనకు న్యాయం చేయాలని కోరినట్లు ఆయన తెలిపారు.

సచివాలయ ఇంజనీరింగ్‌ అసిస్టెంట్‌ అసోసియేషన్‌ నాయకులు గురువారం కలెక్టర్‌ షణ్మోహన్‌ను కలిశారు. క్షేత్రస్థాయిలో ఇంజనీరింగ్‌ అసిస్టెంట్లకు ఉన్న సమస్యలను ఆయనకు విన్నవించారు.

ఆలయ మహాసంప్రోక్షణ పూజలు



చిత్తూరు రూరల్‌: చిత్తూరు నగరంలోని చర్చివీధిలోని శ్రీ కృష్ణ విలాస సభ శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ సంతాన వేణుగోపాలస్వామి ఆలయ జీర్ణోద్ధారణ మహాసంప్రోక్షణ కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. ఆలయ ధర్మకర్త, ఏపీ మొదలియార్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ బుల్లెట్‌ సురేష్‌ ఆధ్వర్యంలో జీర్ణోద్ధరణ పనులు పూర్తి చేశారు. అష్టబంధన మహాసంప్రోక్షణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. శుక్ర, శనివారాల్లో పలు హోమాలు జరగనున్నాయని ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు.

నేటి నుంచి మహాభారత యజ్ఞం

పాలసముద్రం: మండలంలోని కృష్ణజమ్మపురంలో మహాభారత ఉత్సవాలు శుక్రవారం నుంచి జరుగుతాయని ఆలయ ధర్మకర్త బాలయ్యనాయుడు తెలిపారు. కథకురాలు పూర్ణ భాగవతారిణి శుక్రవారం ధ్వజారోహణం, శ్రీకృష్ణలీలలు నాటకం ఉంటుందని చెప్పారు.

సుందరీకరణ పనులు వేగవంతం



గాంధీ విగ్రహ కూడలిలో పనులు పరిశీలిస్తున్న కమిషనర్‌ అరుణ, అధికారులు

చిత్తూరు అర్బన్‌: నగరంలో చేపట్టిన పలు సుందరీకరణ పనులు వారంలో పూర్తి చేయాలని మునిసిపల్‌ కార్పొరేషన్‌ కమిషనర్‌ అరుణ ఇంజనీరింగ్‌ అధికారులను ఆదేశించారు. కమిషనర్‌ గురువారం సాయంత్రం గాంధీ, ఎన్టీఆర్‌ విగ్రహాల కూడలిలో జరుగుతున్న సుందరీకరణ పనులను పరిశీలించారు. పచ్చదనం పెంచే చర్యల్లో భాగంగా గాంధీ విగ్రహ కూడలి ఉద్యానవనం చుట్టూ ఏర్పాటు చేస్తున్న మొక్కలను పరిశీలించి ఇంజనీరింగ్‌ అధికారులకు మార్గనిర్దేశం చేశారు. డివైడర్లకు పెయింటింగ్‌ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఎన్టీఆర్‌ కూడలిలో చేపడుతున్న పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. విజయ డెయిరీ ప్రాంగణాన్ని పరిశీలించారు. కట్టమంచి చెరువు కట్టపై సెంట్రల్‌ లైటింగ్‌ పనులను పరిశీలించారు. కమిషనర్‌ వెంట కార్పొరేటర్‌ వెంకటరమణ, మునిసిపల్‌ ఇంజనీరు వెంకట ప్రసాద్‌, డీఈఈ రమణ, ఏఈలు శ్రీలత, రవీంద్ర పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతాం



మాట్లాడుతున్న ఏపీసీసీ రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు

చిత్తూరు కలెక్టరేట్‌: కేంద్ర ప్రభుత్వం వైఫల్యాలను ఎండగడతామని ఏపీ కాంగ్రెస్‌ కమిటీ (ఏపీసీసీ) రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు ఆరోపించారు. చిత్తూరు నగరంలోని ఓ ప్రైవేట్‌ కళ్యాణ మండపంలో ఆ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. పాల్గొన్న ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ కాంగ్రెస్‌ పార్టీ బలోపేతానికి చర్యలు చేపడుతున్నామన్నారు. ఇరిగేషన్‌ ప్రాజెక్టుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని చెప్పారు. బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కులాలు, మతాలు, ప్రాంతాల మధ్య విభజన తీసుకొస్తోందని మండిపడ్డారు. ఏపీకి రావాల్సిన ప్రయోజనాలను ఎందుకు చెప్పడం లేదని కేంద్రాన్ని ప్రశ్నించారు. ఇటీవల విశాఖకు వచ్చిన కేంద్ర హోం మంత్రి అమిత్‌ షా రైల్వే జోన్‌ అంశం మాట్లాడకపోవడం హేయనీయమన్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీలు, పోలవరం, వెనుకబడిన జిల్లాల నిధులను బీజేపీ మంజూరు చేయలేదని మండిపడ్డారు. ఎన్నికలు వచ్చినప్పుడు దొంగాట ఆడుతున్నారన్నారు. గతంలో బీజేపీని విమర్శించిన చంద్రబాబు నాయుడు మళ్లీ ఇప్పుడు వారితో కలిసేందుకు ప్రయత్నిస్తున్నారన్నాని చెప్పారు. చంద్రబాబుకు కాస్త అయినా సిగ్గు ఉండాలని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ చింతామోహన్‌, పలువురు కాంగ్రెస్‌ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విద్య



విద్యార్థుల సమావేశంలో మాట్లాడుతున్న శరత్‌ చంద్రశేఖర్‌

గుడిపాల: ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో నాణ్యమైన విద్యతోపాటు ఉపాధి అవకాశాలు కూడా మెండుగా ఉంటాయని బొమ్మసముద్రం జూనియర్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ శరత్‌చంద్రశేఖర్‌ అన్నారు. బొమ్మసముద్రం జూనియర్‌ కళాశాలలో గురువారం సింధియా సంస్థ ద్వారా విద్యార్థులకు ఉన్నత విద్య, దాని ఆవశ్యకతపై వివరించారు. ఆయన మాట్లాడుతూ బొమ్మసముద్రం కళాశాలలో మంచి విద్యాబోధన, ఉచిత మధ్యాహ్న భోజనం అందించనున్నట్లు తెలిపారు. క్రీడలు, సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. విద్యార్థులకు కొత్త విద్యాసంవత్సరానికి స్వాగతం పలుకుతూ కెరీర్‌ గైడెన్స్‌ ప్రోగ్రాం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్‌ ప్రోగ్రాం ఆఫీసర్‌ ఓబులేస్‌, సింధియా సంస్థ సిబ్బంది అరవింద్‌ పాల్గొన్నారు.

పాడి రైతులకు పశు బీమా వరం

ఐరాల: వైఎస్సార్‌ పశు బీమా పథకం పాడి రైతులకు వరం అని జిల్లా పశుసంవర్థక శాఖ జేడీ ప్రభాకర్‌ అన్నారు. స్థానిక పశువైద్యశాలలో గురువారం మండల పశువైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. జేడీ మాట్లాడుతూ పాడి రైతులు, గొర్రెలు, మేకల పెంపకందారులకు ఊరట కలిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా పశుబీమా పథకం ప్రవేశ పెట్టిందన్నారు. బీమా చేయించిన పశువులు మృత్యువాత పడితే రైతు నష్టపోకుండా పరిహారం అందుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, పాడి రైతులు, బియ్యం కార్డు కలిగిన రైతుల లబ్ధిదారు వాటా కింద మూడేళ్ల కాల వ్యవధికి గాను రూ.364 ప్రీమియం చెల్లిస్తే రూ.30 వేలు, నాటు పశువులకు రూ.192 ప్రీమియం చెల్లిస్తే రూ.15 వేలు పరిహారం వర్తిస్తుందన్నారు. ఒక్కో గొర్రె లేదా మేకకు ఏడాదికి రూ.36, రెండేళ్లకు రూ.54, మూడేళ్లకు రూ.75 చొప్పున ప్రీమియం చెల్లిస్తే రూ.6 వేలు బీమా వర్తిస్తుందన్నారు. పాడి రైతులకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. పథకం లబ్ధి కోసం ఆర్‌బీకేలను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో పశుసంవర్థక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్‌ చంద్రశేఖర్‌, మండల పశుసంవర్థక శాఖ ఏడీ పద్మావతి, యునైటెడ్‌ ఇండియా ఇన్సూరెన్స్‌ కంపెనీ మేనేజర్‌ వినయ్‌కుమార్‌, మద్దిపట్ల పల్లె పశు వైద్యశాల డాక్టర్‌ పినాకపాని, ఏహెచ్‌ఏలు పాల్గొన్నారు.

పశు బీమాను సద్వినియోగం చేసుకోండి

పాడి రైతులు వైఎస్సార్‌ పశు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల పశుసంవర్ధక శాఖ ఏడీ పద్మావతి పిలుపునిచ్చారు. మండలంలోని 35 యర్లంపల్లెలో గురువారం వైఎస్సార్‌ పశు బీమా పథకంపై ఆమె పాడి రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఏడీ మాట్లాడుతూ వైఎస్సార్‌ పశు బీమా పథకంలో చేరిన పాడి రైతు 20 శాతం వాటా చెల్లిస్తే మిగిలిన 80 శాతంలో కేంద్ర ప్రభుత్వం 40 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం వాటా చెల్లిస్తాయని తెలియజేశారు. ఆపదలో పాడిరైతు నష్టపోకుండా ఈ బీమా లబ్ధి చేకూరుస్తుందని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేడీ ప్రభాకర్‌



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీ పద్మావతి

ధ్రువపత్రాల మంజూరులో జాప్యం వద్దు



తహసీల్దార్‌ రవికుమార్‌రాజును సన్మానిస్తున్న ఏఎంసీ డైరెక్టర్‌ ఆకుల గోపి, నాయకులు

కార్వేటినగరం: రైతులు, విద్యార్థులకు అందించే ధ్రువపత్రాల మంజూరులో ఆలస్యం వద్దని తహసీల్దార్‌ రవికుమార్‌రాజు అన్నారు. గురువారం సీడీ కండ్రిగ సచివాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌ మాట్లాడుతూ ధ్రువపత్రాల మంజూరు కోసం దరఖాస్తులు చేసుకున్న రైతులు, విద్యార్థులకు జాప్యం లేకుండా ఎప్పటికప్పుడు అందించాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రీసర్వేలను రైతులు ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. సచివాలయ పరిధిలో భూసమస్యలు లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, వివాదాస్పదమైన భూసమస్యలను మండలస్థాయికి తీసుకురావాలని, అక్కడ పరిష్కారం కాని వాటిని మాత్రమే జిల్లా స్థాయికి పంపాలని తెలిపారు. సచివాలయ స్థాయిలో పరిష్కరించకపోతే రైతులు జిల్లా స్థాయిలో జరిగే స్పందన కార్యక్రమానికి వెళ్తున్నారని, అలాకాకుండా చిన్నచిన్న సమస్యలను సచివాలయం లేదా మండల స్థాయిలోనే పరిష్కరించుకోవాలని చెప్పారు. అనంతరం తహసీల్దార్‌ను ఏఎంసీ డైరెక్టర్‌ ఆకుల గోపి, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి ఘనంగా సన్మానించారు. డీలర్ల సంఘం అధ్యక్షుడు లక్ష్మీపతిరెడ్డి పాల్గొన్నారు.